సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం। 29। జూన్। 2023



త్యాగానికి ప్రతీక.. బక్రీద్
త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ముస్లింలు మసీదులను ముస్తాబు చేశారు.
8లో ▸



కూలీలకు తీవ్రగాయాలు
పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు కూలీలకు తీవ్రగాయాలయ్యాయి.
8లో ▸



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం
ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు వేంకటేశ్వర అవిర్నేని తారక బ్రహ్మం, దోనవల్లి పుష్పావతి చారిటబుల్ ట్రస్టు (కృష్ణా జిల్లా వేలేరు) సభ్యులు రూ.4 లక్షలు విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

మెరుగైన సేవలు అందించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. భీమవరం 36, 37 వార్డుల సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, సంక్షేమ పథకాల క్యాలెండరు, ప్రజా సమస్యల పరిష్కార నివేదిక రిజిస్టరు తదితరాలను ఆయన పరిశీలించారు. వచ్చే నెలలో ప్రభుత్వం అమలు చేసే పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను సోషల్ ఆడిట్ చేశారా లేదా అన్నది ఆరా తీశారు. అర్హుల జాబితాను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ఇంటింటా సర్వే తీరును పరిశీలించారు. తహసీల్దారు వై.రవికుమార్ ఆయన వెంట ఉన్నారు.

జర్మనీలో స్టాఫ్ నర్సు అవకాశాలు

సాక్షి, భీమవరం: బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్‌డీసీ), టెక్ సంయుక్త ఆధ్వర్యంలో జర్మనీలో స్టాఫ్ నర్సులుగా అవకాశం కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 20–35 ఏళ్లలోపు వయసు కలిగి, కనీసం రెండేళ్లు సాధారణ ఆస్పత్రుల్లో అనుభవం కలిగి జర్మన్ భాష నేర్చుకునే ఆసక్తి కలిగిన వారు అర్హులన్నారు. విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో జర్మన్ భాష శిక్షణ కోసం నిర్బంధ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులకు హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బీ1 స్థాయి ఉత్తీర్ణత సాధించిన తర్వాత జర్మనీలో పనిచేయడానికి ఆఫర్ లెటర్ ఇస్తారని తెలిపారు.

రవాణా వాహన పన్నులు చెల్లించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో 1,658 రవాణా వాహనాల పన్ను ఆయా పెనాల్టీలతో కలిపి చెల్లించాలని ఆర్టీఓ ఉమా మహేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. త్రైమాసిక పన్ను చెల్లించని వారు 50 శాతం పెనాల్టీతో కలిపి చెల్లించాలని, తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం పెనాల్టీతో చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సీపేజ్‌ను అరికట్టాలి

భీమవరం (ప్రకాశంచౌక్): రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) సీపేజీలను వెంటనే అరికట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో భీమవరంలోని మూడు ఆర్‌యూబీల సీపేజీలపై రైల్వే అధికారులతో సమీక్షించారు. సీపేజీలతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని, వెంటనే సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌యూబీలను శుభ్రంగా ఉంచేలా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రైల్వే ఏడీఎం శంకర్, మున్సిపల్ ఇంజినీర్ పి.త్రినాథరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేశ్వర్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో ఎరువులు

ఏలూరు రూరల్: గ్రామాల్లో రైతులకు సకాలంలో ఎరువులు సరఫరా చేయాలని మార్క్‌ఫెడ్ ఎండీ, మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే అన్నారు. బుధవారం ఆయన ఏలూరు మార్కెట్ యార్డులో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కో–ఆపరేటివ్ సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రైతుల కోసం పెద్దెత్తున ఎరువులు సరఫరా చేస్తోందన్నారు. సొసైటీలు ముందస్తుగా ఎరువులు సిద్ధం చేసుకోవాలని, రైతులకు సమయానికి ఎరువులు సరఫరా చేయాలన్నారు. పలువురు సభ్యులు ఎరువులు దిగుమతి, సరఫరాలో ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కమిషనర్ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవులు, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణతో కలిసి యార్డులో నిర్మాణమవుతున్న జంబోషెడ్లు పనులు, మౌలిక వసతులను పరిశీలించారు.

ఉపాధ్యాయ పదోన్నతుల మార్గదర్శకాలు విడుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయుల పదోన్నతులకు మార్గదర్శకాలు, షెడ్యూల్‌లను ప్రభుత్వం విడుదల చేసిందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులకు సీనియారిటీ జాబితాను 30న ప్రదర్శిస్తారని, జూలై 1,2 తేదీల్లో అభ్యంతరాలు సమర్పించవచ్చ న్నారు. 3న తుది సీనియారిటీ జాబితా ప్రదర్శించి 4న పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ క్యాడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులకు 30న సీనియారిటీ జాబితా ప్రదర్శిస్తారని, జూలై 1 నుంచి 3 వరకూ అభ్యంతరాలు సమర్పించవచ్చన్నారు.

నైపుణ్యాలు పెంచేలా ఆనర్స్ డిగ్రీ

- నాలుగేళ్ల కోర్సులకు శ్రీకారం
- రాష్ట్రంలో వినూత్నంగా డిగ్రీ విద్య
- ఉమ్మడి జిల్లాలో 91 కళాశాలల్లో అమలు
- ప్రవేశాలకు గడువు పెంపు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచడంతో పాటు సబ్జెక్టుపై పూర్తి పట్టు సాధించేలా, పోటీతత్వాన్ని తట్టుకునేలా రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ విద్యలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సులను 2023–24 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనుంది. ఆనర్స్ డిగ్రీ కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని విద్యా నిపుణులు అంటున్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ఈ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు ఇప్పటికే ప్రవేశాల నోటిఫికేషన్ కూడా విడుదలయ్యింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని 91 డిగ్రీ కళాశాలల్లో ఆనర్స్ డిగ్రీ కోర్సులు నిర్వహిస్తున్నారు.

సబ్జెక్టుపై సంపూర్ణ అవగాహనకు..
జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా డిగ్రీ ఆనర్స్ కోర్సుల్లో మార్పులు తీసుకువచ్చిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోంది. ప్రధానంగా డిగ్రీ ఆనర్స్ కోర్సులో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని తీసుకువచ్చింది. దీని ద్వారా విద్యార్థి తనకు ఆసక్తి ఉన్న ఒక సబ్జెక్టును ప్రధాన సబ్జెక్టుగా ఎంపిక చేసుకుని నాలుగేళ్లపాటు చదవవచ్చు. దీని ద్వారా సబ్జెక్టుపై సంపూర్ణ అవగాహన పెరుగుతుంది. అలాగే మరో మైనర్ సబ్జెక్టు, రెండు లాంగ్వేజ్ పేపర్లు కూడా చదవాలి. సమగ్ర విషయ పరిజ్ఞానం కోసం ఇంటర్ డిసిప్లినరీ కోర్సు, మల్టీ డిసిప్లినరీ కోర్సులు కూడా ఉంటాయి. ఉదాహరణకు.. ఇంటర్‌లో బైపీసీ చదివిన విద్యార్థి డిగ్రీ బీఎస్సీ ఆనర్స్‌లో జువాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఫిషరీస్ సబ్జెక్టుల్లో ఒక దానిని మేజర్ సబ్జెక్టుగా, జియాలజీ, పాలిటిక్స్, హిస్టరీ, ఎకనామిక్స్ వంటి ఆర్ట్స్ గ్రూపుల్లోని సబ్జెక్టులను కూడా మైనర్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవచ్చు. ఇంటర్‌లో ఎంపీసీ చదివిన విద్యార్థి డిగ్రీ ఆనర్స్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్స్, స్టాటిస్టిక్స్, జియాలజీల్లో ఒక దానిని మేజర్ సబ్జెక్టుగా ఎంచుకుని మైనర్ సబ్జెక్టుగా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, యానిమేషన్స్ తదితర సబ్జెక్టుల్లో ఒక దానిని అభ్యసించవచ్చు.

ఏ సంవత్సరంలో మానేసినా సర్టిఫికెట్
గతంలో విద్యార్థి డిగ్రీ చదువు మధ్యలో ఆపి వేస్తే అతడికి ఎటువంటి సర్టిఫికెట్ కూడా వచ్చేది కాదు. అయితే నూతన విధానంలో విద్యార్థి అనివార్య కారణాల వల్ల ఏ సంవత్సరంలో అయినా చదువు మానేసినా సర్టిఫికెట్ జారీ చేస్తారు. నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్‌లో చేరి మొదటి ఏడాదిలో సబ్జెక్టులన్నీ పూర్తి చేసి చదువు మానివేస్తే అండర్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్, ద్వితీయ సంవత్సరంలో చదువు మానివేస్తే అండర్ గ్రాడ్యుయేట్ డిప్లమా సర్టిఫికెట్, తృతీయ సంవత్సరంలో మానివేస్తే అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ సర్టిఫికెట్ ఇస్తారు. నాలుగేళ్లు పూర్తిచేసిన వారికి డిగ్రీ మేజర్ సర్టిఫికెట్ ఆనర్స్ పట్టా అందిస్తారు.

ఉమ్మడి జిల్లాలో..
పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు 51 ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో 12,050 మంది బీఏ, 9,856 మంది బీకాం, 27,131 మంది బీఎస్సీ కోర్సులు పూర్తి చేశారు. ఏలూరు జిల్లాలో 40 డిగ్రీ కళాశాలలు ఉండగా గతేడాది 1,119 మంది బీఏ, 3,687 మంది బీకాం, 7,659 మంది బీఎస్సీ కోర్సులు చేశారు.

ప్రవేశాల షెడ్యూల్ ఇలా..
- డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు గడువును వచ్చేనెల 5వ తేదీ వరకు పెంచారు.
- విద్యార్థులు ఏపీఎస్‌సీహెచ్‌ఈ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి లేదా తమ దగ్గరలోని డిగ్రీ కళాశాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
- జూలై 7 నుంచి 12వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాలి.
- జూలై 17 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.
- సాధారణ డిగ్రీ కోర్సులకు రూ.3 వేల వరకూ, కంప్యూటర్ కోర్సులకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకూ ఫీజు ఉంటుంది.
- అర్హులైన పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన ద్వారా ఆర్థిక సాయం అందిస్తుంది.

చదివిన గంటలను క్రెడిట్లుగా..



విద్యార్థులు మేజర్ సబ్జెక్టుకు సంబంధించి 21 పేపర్లు, మైనర్ సబ్జెక్టుకు సంబంధించి 6 పేపర్లు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఈ విధానంలో విద్యార్థి కళాశాలలో చదివిన గంటలను క్రెడిట్‌లుగా పరిగణిస్తారు. విద్యార్థి మొదటి సంవత్సరం తర్వాత కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు, ద్వితీయ సంవత్సరం తర్వాత షార్ట్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ అనంతరం సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది.
– కేవీ రామరాజు, ప్రిన్సిపాల్, సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల, ఏలూరు

ప్రయోజనాలెన్నో..



డిగ్రీ నూతన ఆనర్స్ విధానంలో చదివే విద్యార్థులకు ప్రయోజనాలు చాలా ఉన్నాయి. దీంతోపాటు ఆనర్స్ విత్ రీసెర్చ్ చేస్తే పోస్టు గ్రాడ్యుయేషన్ చేయకుండా నేరుగా పీహెచ్‌డీ చేసే అవకాశం కూడా ఉంది. అలాగే నాలుగేళ్ల ఆనర్స్ కోర్సు చేసిన విద్యార్థి పోస్టు గ్రాడ్యుయేషన్ చదువును ఏడాదిలోనే పూర్తి చేయవచ్చు. డిగ్రీ కోర్సును మధ్యలో ఆపివేసినా పూర్తిచేసిన విద్యకు సంబంధించి సర్టిఫికెట్ ఇస్తారు.
– ప్రొఫెసర్ కేఎస్ రమేష్, డీన్, కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ

దళితులూ.. చంద్రబాబు ట్రాప్‌లో పడొద్దు

ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనందప్రకాష్



ఏలూరు టౌన్: రాష్ట్రంలో దళితులను మరోసారి మోసం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలు చేస్తున్నారనీ.. మోసకారి చంద్రబాబు ట్రాప్‌లో దళిత నాయకులు పడవద్దని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నానిని ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు నీచ బుద్ధిని దళిత నేతలు గుర్తించి నడచుకోవాలని హితవు పలికారు. చంద్రబాబు 25 ఏళ్ల క్రితం ఒక తల్లిబిడ్డల్లా ఉన్న మాలమాదిగల మధ్య చిచ్చుపెట్టారని, ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలను మోసం చేశారని మండిపడ్డారు. ఇప్పుడు మరోమారు మాలలను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.

ఏ పథకాలు ఆగాయో చెప్పాలి
రాష్ట్రంలో దళితులకు సంబంధించి సీఎం జగన్ ఏ పథకాలు రద్దు చేశారో ఆధారాలతో నిరూపించాలని ఆనందప్రకాష్ సవాల్ విసిరారు. దళిత నేతలు దళారుల్లా మారి చంద్రబాబుకు వత్తాసు పలుకుతూ ఎస్సీలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించటం దారుణమన్నారు. చంద్రబాబు గత ఐదేళ్ల పాలనలో ఎస్సీలకు ఏంచేశారో చెప్పాలన్నారు. అప్పట్లో ఎస్సీ కార్పొరేషన్‌లో రూ.200 కోట్ల నిధులు దారి మళ్లాయని ఎస్సీ కమిషన్ గుర్తించిందన్నారు. దీనిపై ప్రభుత్వానికి నివేదికలు సమర్పించామనీ, సీబీసీఐడీతో విచారణ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

అట్రాసిటీ పరిహారం కింద రూ.180 కోట్లు
సీఎం జగన్ నాలుగేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి సుమారు రూ.180 కోట్లు నష్టపరిహారంగా ఇస్తే.. చంద్రబాబు హయాంలో కేవలం రెండు లేదా మూడు కోట్ల రూపాయలతో సరిపెట్టారన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న విదేశీ విద్య దీవెన పథకంలో ప్రపంచంలోని టాప్–200 యూనివర్సిటీల్లో చేరితే విద్యార్థికి రూ.80 లక్షలు చెల్లించేలా చర్యలు తీసుకున్నారనీ, అదే చంద్రబాబు హయాంలో కేవలం రూ.10 లక్షలు చెల్లించి చేతులు దులుపుకున్నారని గుర్తు చేశారు. కరోనా కాలంలో ప్రపంచవ్యాప్తంగా విద్యాసంస్థలు అడ్మిషన్లు నిలుపుదల చేస్తే అప్పుడు విదేశీ విద్య ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎస్సీలకు సంక్షేమ పథకాల కింద నాలుగేళ్లలో రూ.60 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని, దళిత కుటుంబాల జీవన స్థితిగతుల్లో మార్పులు వచ్చాయని చెల్లెం అన్నారు.

రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యం

మంత్రి కారుమూరి



భీమవరంలో అమ్మఒడి చెక్ అందిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీలు వంక, జయమంగళ, కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని తెలుసుకోకుండా చంద్రబాబు, పవన్ కల్యాణ్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. బుధవారం భీమవరంలోని ఏఎస్‌ఆర్ సాంస్కృతి కేంద్రంలో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి అమ్మఒడి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో పేదలు సైతం ఉన్నత విద్యనభ్యసించి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలనే సంకల్పంతో సీఎం జగన్ విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. కోట్లాది రూపాయల ఖర్చుతో విద్యనందిస్తుంటే చంద్రబాబు, పవన్ మరుగుదొడ్లు బాగాలేవని, స్కూళ్లు మూసివేస్తున్నారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. వేదికపై విద్యార్థులను గతంలో స్కూల్స్‌కు ఇప్పటి స్కూల్స్‌కు ఉన్న తేడాను మంత్రి అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం విద్యలో 15వ స్థానంలో ఉండగా సీఎం జగన్ చేపట్టిన చర్యలతో ఇప్పుడు మూడో స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. జగనన్న అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు అండగా ఉండేందుకు ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని 42,61,965 తల్లుల బ్యాంకు ఖాతాల్లో నాలుగో విడత రూ.6,393 కోట్లు జమచేస్తున్నట్టు మంత్రి కారుమూరి చెప్పారు.

జిల్లాలో రూ.215.30 కోట్లు అందజేత
కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 1 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు సంబంధించి 1,43,534 మంది తల్లుల ఖాతాల్లో రూ.215.30 కోట్లను జమ చేసినట్టు చెప్పారు. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు చదువుకునేలా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. డిజిటల్ తరగతి గదులు ఏర్పాటుచేశామని, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం మంత్రి కారుమూరి, కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా విద్యార్థులు, వారి తల్లులకు నమూన చెక్ అందించారు. ఎమ్మెల్సీలు వంక రవీంద్రనాథ్, జయమంగళం వెంకటరమణ, ఎస్పీ యు.రవిప్రకాష్, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, ఎస్‌ఎస్‌ఏ ఏపీఓ పి.శ్యాంసుందర్, ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహారాజు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాలదేవి, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కొట్టు కుటుంబరావు, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ కేటీ సుధాకర్, గాదిరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

రైతులకు రుణమస్తు

- విరివిగా పంట రుణాల మంజూరు
- ఇప్పటివరకూ రూ.1,133 కోట్ల అందజేత
- జిల్లాలో 2.37లక్షల ఎకరాల్లో వరి సాగు



వేంద్ర కెనరా బ్యాంకులో రుణాలు పొందుతున్న రైతులు

భీమవరం(ప్రకాశం చౌక్): అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. విత్తు నుంచి పంట విక్రయాల వరకూ అన్నివిధాలా అండగా నిలుస్తోంది. దీనిలో భాగంగా వ్యవసాయ రుణాలు విరివిగా అందించేలా చర్యలు తీసుకుంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణ పరిమితి పెంచడంతో పాటు రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రుణాలు ఇచ్చేలా బ్యాంకర్లతో అధికారులు సమన్వయం చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా ఖరీఫ్ సాగుకు సంబంధించి వ్యవసాయ రుణాలను వేగంగా మంజూరు చేస్తున్నారు. భూమి కలిగిన రైతులతో పాటు సీసీఆర్‌సీ కార్డు పొందిన కౌలు రైతులకు సైతం పంట రుణాలు అందిస్తున్నారు. రుణాలు సకాలంలో అందడంతో రైతులు సార్వా పనులు చురుగ్గా చేపడుతున్నారు.

రూ.12.18 కోట్ల వడ్డీ రాయితీ
జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో పంట రుణాల లక్ష్యం రూ.8,466 కోట్లు కాగా ఏప్రిల్ నుంచి ఇప్పటివరకూ రూ.1,133 కోట్ల రుణాలను బ్యాంకులు అందించాయి. జిల్లాలో రైతులకు గతేడాది రూ.7,494 కోట్ల పంట రుణాలు అందించగా సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు రూ.12.18 కోట్ల వడ్డీ రాయితీని ప్రభుత్వం జమచేసింది.

పూచీ లేకుండా రూ.1.60 లక్షల వరకు..
అర్హులైన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేసి ఎటువంటి పూచీలేకుండా రూ.1.60 లక్షల వరకూ బ్యాంకులు రుణాలు అందించేలా లీడ్ బ్యాంక్ చర్యలు తీసుకుంటోంది. రుణాలను సకాలంలో రైతులకు వడ్డీ రాయితీని ప్రభుత్వం కల్పిస్తుంది.

అధిక వడ్డీల నుంచి రక్షణ : వ్యవసాయానికి పెట్టుబడి కోసం రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకుని ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ముందుగానే బ్యాంకుల ద్వారా రుణాలు అందించనుంది. బ్యాంకుల ద్వారా అతి తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయడంతో పాటు సకాలంలో తిరిగి చెల్లిస్తే వడ్డీ రాయితీని కల్పిస్తోంది. సాగుకు ముందే బ్యాంకు రుణాలు పొందేలా చర్యలు తీసుకుంది. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

రూ.5 వేల వరకు పెంపు : జిల్లాలో సుమారు 2.37 లక్షల ఎకరాల్లో అత్యధికంగా వరి సాగు ఉంది. జరుగుతుంది. వరికి సంబంధించి గత ఖరీఫ్‌లో ఎకరాకు రూ.34 వేల నుంచి రూ.38 వేల వరకూ, రబీలో రూ.38 వేల నుంచి రూ.40 వేల వరకూ రుణ సదుపాయం ఉంది. 2023–24లో రుణపరిమితి అదనంగా రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకూ పెంచారు.

కౌలు కార్డులతో.. భూమి యాజమానికి ఇబ్బంది లేకుండా 11 నెలల పాటు కౌలుకు సంబంధించి కౌలు రైతులకు ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డులను మంజూరు చేస్తుంది. వీటి ద్వారా రుణాలు అందిస్తోంది.

2023-24 రుణ పరిమితి
(ఎకరాకు) (రూ.లలో)

వరి (ఖరీఫ్)	38 వేల నుంచి 42 వేలు
వరి (రబీ)	42 వేల నుంచి 45 వేలు
అరటి	65 వేల నుంచి 80 వేలు
బొప్పాయి	72 వేల నుంచి 75 వేలు
మామిడి	40 వేల నుంచి 45 వేలు
నిమ్మ	22 వేల నుంచి 27 వేలు
పండు మిరప	80 వేల నుంచి 90 వేలు
పచ్చిమిర్చి	68 వేల నుంచి 75 వేలు
మొక్కజొన్న	38 వేల నుంచి 42 వేలు

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం..



రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నాం. బ్యాంకులతో సమన్వయం చేసుకుంటున్నాం. కిసాన్ క్రెడిట్ కార్డు ఉంటే ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.1.60 లక్షల రుణం బ్యాంకులు అందజేస్తాయి. రుణాలు సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుంది. క్షేత్రస్థాయిలో రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన కల్పిస్తున్నాం.
– ఎ.నాగేంద్ర ప్రసాద్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, భీమవరం

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం



నియామకపత్రాలు అందజేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తూ వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటానని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ క్యాంపు కార్యాలయంలో కారుణ్య నియామకాలు, పదోన్నతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పదోన్నతులపై చర్యలు తీసుకుని తక్షణమే 30 మందికి పదోన్నతులు చేపట్టారు. తాను బాధ్యతలు స్వీకరించిన వెంటనే కారుణ్య నియామకాల దస్త్రంపై తొలి సంతకం చేశామని ఆమె చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత లభిస్తోందని, ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను జగనన్న సర్కారు రెగ్యులరైజ్ చేసిందని ఆమె చెప్పారు. జగనన్న ప్రభుత్వ పాలనలో ఉద్యోగులంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులపై తనకు ఎంతో గౌరవం ఉందని, ఉద్యోగులు ఏ సమస్య వచ్చినా నేరుగా తనను కలవచ్చని ఆమె చెప్పారు.

తూర్పు కాపు సంఘానికి, చంద్రమోహన్‌కు సంబంధం లేదు

తూర్పు కాపు నేతల స్పష్టీకరణ



భీమవరంలో విలేకరులతో మాట్లాడుతున్న తూర్పు కాపుల సంఘం నేతలు

భీమవరం(ప్రకాశం చౌక్) : తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ వ్యక్తిగతంగానే జనసేన పార్టీలో చేరారని ఆయనకు, తూర్పుకాపు సంఘానికి ఎలాంటి సంబంధం లేదని తూర్పు కాపు సంఘం పట్టణ కార్యదర్శి ముల్లి నరసింహమూర్తి, తూర్పు కాపు నేతలు స్పష్టం చేశారు. భీమవరంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ చంద్రమోహన్ తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాత్రమేనని, తమది సంక్షేమ సంఘం కాదని, తూర్పు కాపులు ఒక పార్టీకి పని చేసే వారు కాదని, ఏ పార్టీ సంఘానికి అన్ని విధాలా తోడ్పాటు ఇచ్చి మేలు చేస్తుందో వారికే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో తమకు ఎలాంటి ఇబ్బందీ లేదని, అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని, తూర్పు కాపులకు పలు పదవులు కూడా వచ్చాయన్నారు. చంద్రమోహన్ జనసేన పార్టీలో చేరితే తూర్పు కాపులంతా జనసేన వైపు ఉన్నట్లు కాదని.. ఒకవేళ అలాంటి సంకేతాలు వస్తే వాటిని ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో కార్యక్రమంలో పెన్నాడ శ్రీను, శివగణేష్, ముల్లి శ్రీనివాస్, పతివాడ రాజేంద్ర, జయరాం, జట్ల రాంబాబు, తాళ్లపూడి పరమేశ్వరావు, తాళ్లపూడి గాంధీ, మునకాల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్కి అవతారంలో జగన్నాథుడు



ద్వారకాతిరుమల: దుష్టసంహారం నిమిత్తం అశ్వవాహనంపై బయలుదేరిన కల్కి అవతారంలో జగన్నాథ స్వామివారు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో డాలు ధరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ నిమిత్తం అవతరించనున్న కల్కి భగవానుడి రూపంలో ఉన్న జగన్నాథుడిని పలువురు భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జగన్నాథ రథోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో స్వామివారు దశావతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు.

ఆయిల్‌పామ్ తోట ధ్వంసంపై కేసు నమోదు

టి.నరసాపురం: ఆయిల్‌పామ్ తోట ధ్వంసం చేసిన ఘటనలో బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ చెప్పారు. తెలంగాణ రాష్ట్రం దమ్మపేటకు చెందిన రావు శ్రీధర్‌కు మండలంలోని మక్కినవారిగూడెం గ్రామ పరిధిలో నాలుగున్నర ఎకరాల భూమి ఉంది. దీనిలో ఆరు నెలల క్రితం ఆయిల్ పామ్ మొక్కలు వేశారు. ఈ క్రమంలో మంగళవారం శ్రీధర్ తన పొలానికి వెళ్లగా, ఆయిల్‌పామ్ మొక్కలు నరికి వేసి ఉండటాన్ని గుర్తించాడు. ఇలా పొలంలోని 300 మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు గుర్తించాడు. సుమారు రూ.1 లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

త్యాగానికి ప్రతీక.. బక్రీద్

- రంజాన్ తరువాత అంతటి ప్రాముఖ్యత ఉన్న పర్వదినం
- నేడు బక్రీద్ పండుగ.. ఊరూరా ముస్తాబైన మసీద్‌లు
- పవిత్రమైన ఖుర్బానీ, ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు

చింతలపూడి: ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో బక్రీద్ ఒకటి. ధనిక, పేద తారతమ్యం లేకుండా ప్రతి ముస్లిం ఈ పండుగను జరుపుకుంటారు. పవిత్ర త్యాగానికి ప్రతిరూపమైన దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లాహ్ ప్రసన్నం కోసం చేసిన మహోన్నత త్యాగాన్ని ఈ పండుగ సందర్భంగా ముస్లింలు స్మరించుకుంటారు. ఇస్లాం మతంలో రంజాన్ తరువాత అంత ప్రాముఖ్యత ఉన్న పండుగ ఈదుల్ జుహా (బక్రీద్). దీన్నే త్యాగాల పండుగ అని కూడా ముస్లింలు పిలుచుకుంటారు. గురువారం దేశవ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకోనున్నారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఒక గొర్రె పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని నిరుపేదలకు పంచి పెడతారు. మిగిలిన భాగాలలో రెండో దాన్ని బంధువులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. దీన్నే ఖుర్బానీ అంటారు. ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేపడతారు. పవిత్ర స్థలం మక్కాను సందర్శించడానికి ఇష్టపడతారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరానికి వెళ్లి మస్జిద్-అల్-హరామ్‌లోని కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణాలు చేస్తారు. బక్రీద్ పండుగ రోజు ముస్లింలు అందరూ ఈద్‌గాహ్‌కు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేస్తారు.

సందడి షురూ

జిల్లాలోని బక్రీద్ సందడి మొదలైంది. పండుగ సందర్భంగా పొట్టేళ్లు, గొర్రెలు, మేకల విక్రయాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఖుర్బానీ ఇవ్వడం కోసం ఇప్పటికే కొందరు హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా పొట్టేళ్లను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. మరి కొద్ది మంది తాడేపల్లిగూడెం, గుంటూరు, మచిలీపట్నం, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి ఖుర్బానీ కోసం సిద్ధం చేసుకున్నారు. స్థానికంగా కూడా కొందరు వ్యాపారులు ఏడాది పొడవునా పొట్టేళ్లను పెంచి విక్రయిస్తుంటారు. ఒక్కో పొట్టేలు రూ.8 వేల నుంచి రూ.20 వేల వరకు ధర పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలోని ఏలూరు, నూజివీడు, తాడేపల్లిగూడెం, తణుకు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, ఆకివీడు, పోలవరం తదితర ప్రాంతాల్లో బక్రీద్‌ను ఘనంగా జరుపుకుంటారు. బక్రీద్ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సుమారు రూ.5 కోట్లపైనే పొట్టేళ్ల వ్యాపారం జరుగుతుందని అంచనా.



పొట్టేళ్లకు గిరాకీ

బక్రీద్ వస్తోందంటే పొట్టేళ్లకు గిరాకీ పెరుగుతుంది. వారం రోజుల నుంచే మెట్ట ప్రాంతంలో పండుగ సందర్భంగా కొత్త బట్టలు, పండుగ సామగ్రి కొనుగోలు చేస్తారు. ఖుర్బానీ ఇవ్వడానికి గొర్రెలు, మేకలను దూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటారు. పండుగ తరువాత కూడా నెల మొత్తం ఖుర్బానీ ఇచ్చుకునే అవకాశం ఉండటంతో పొట్టేళ్ల అమ్మకాలు కొనసాగనున్నాయి.



బక్రీద్‌కు ముస్తాబైన చింతలపూడిలోని మస్జిద్

ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ



బక్రీద్ సందర్భంగా ప్రతి ముస్లిం విధిగా పొట్టేలు మాంసాన్ని ఖుర్బానీ ఇచ్చి పేదలకు పంచడం ఆనవాయితీ. అలాగే ఈ పండుగ సందర్భంగా ముస్లింలు తమ జీవితకాలంలో ఒక్కసారైనా అతి పవిత్రమైన మక్కాను సందర్శించి ముక్తిని పొందాలి.

– మహమ్మద్ అబ్దుల్ వదూద్, ఇమామ్, జామియ మస్జిద్

త్యాగ నిరతిని తెలియజేస్తుంది



బక్రీద్ పండుగ మనిషికి దైవ భీతిని, త్యాగనిరతిని తెలియజేస్తుంది. అందుకే ఈ పండుగను త్యాగాల పండుగ అంటారు. అంతేకాకుండ చనిపోయిన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని వారి పేరున ఖుర్బానీ ఇవ్వడం ఈ పండుగ ప్రత్యేకత.

– ఎండీ ఇబ్రహీం దౌలా (జీలాని), కార్యదర్శి, జామియ మస్జిద్, చింతలపూడి

కులధ్రువీకరణల జారీలో భారీగా అవకతవకలు?



కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం

కుక్కునూరు: మండలంలో కులధ్రువీకరణ పత్రాల జారీలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారితో పాటు కింది స్థాయి సిబ్బంది అవినీతికి పాల్పడి భారీగా సొమ్ము చేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. మారుమూల ఏజెన్సీ ప్రాంతం కావడం సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అందినకాడికి దండుకోని అధికారులు నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్‌లు జారీ చేశారని చెబుతున్నారు. మండలంలో ఓ గ్రామానికి చెందిన గిరిజన యువతిని వివాహం చేసుకున్న గిరిజనేతరుడికి ఎస్టీ కులధ్రువీకరణ జారీ చేశారని తెలిసింది. అలాగే రాష్ట్ర విభజన నేపథ్యంలో మున్నూరు కాపులకు బీసీ డీ సర్టిఫికెట్‌ల జారీ నిలిపివేసినా ఓ వ్యక్తికి మున్నూరు కాపు సర్టిఫికెట్ ఇవ్వడం అప్పట్లో చర్చనీయాంశమైంది. తరువాత ఈ విషయం బహిర్గతం కావడంతో రెవెన్యూ అధికారులు మండలంలోని పెద్దల సాయంతో సర్టిఫికెట్‌లు వెనక్కి తీసుకుని జాగ్రత్తపడటం బహిరంగ రహస్యమే. గిరిజనేతరుడికి గిరిజనుడిగా సర్టిఫికెట్ జారీపై కొందరు ఆధారాలు కూడా సేకరించినట్టు తెలుస్తోంది. ఇది కాక అనర్హులకు ఏజెన్సీ సర్టిఫికెట్‌లు జారీ చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ చేసి అవకతవకలను వెలుగులోకి తెచ్చి బాధ్యులపై చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నలుగురికి జరిమానా

భీమడోలు: మండలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నలుగురికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ భీమడోలు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పీఏఎస్ఎస్ ఆర్‌కే ఆదిత్య తీర్పునిచ్చారు. తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు లారీ డ్రైవర్లు, ఒక ఆటో వాలాను బుధవారం భీమడోలు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్టు ఎస్సై చావా సురేష్ కుమార్ తెలిపారు.

లారీ ఢీకొని ముగ్గురు కూలీలకు తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయాలపాలైన యువకులు

పాలకోడేరు: గొల్లలకోడేరులో బుధవారం బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఉప్పరగూడెంకు చెందిన చింతపల్లి శ్రీను, కాలా శ్రీను, చింతపల్లి మాణిక్యాలరావు అనే యువకులు కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నారు. బుధవారం వీరు బైక్‌పై పాలకోడేరులో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. గొల్లలకోడేరు సమీపంలోకి వచ్చేసరికి గరగపర్రు నుంచి భీమవరం వెళుతున్న లారీ వీరిని ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో క్యాబిన్ కింద ఇరుక్కుపోయిన వీరిని లారీ కొంతదూరం వరకు ఈడ్చుకువెళ్లిందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన వీరిని స్థానికులు 108 వాహనంలో భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వీరిలో చింతపల్లి శ్రీను పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తీసుకువెళ్లారు. ఆసుపత్రి నుంచి సమాచారం మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు.

బస్సు కింద పడి వృద్ధురాలి దుర్మరణం



అత్తిలి: మంచిలిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామానికి చెందిన పాత్రపల్లి వరలక్ష్మి (60) భర్త సత్యనారాయణతో కలిసి బుధవారం మోపెడ్‌పై అత్తిలి మండలం మంచిలిలోని పీహెచ్‌సీకి వచ్చారు. ఆసుపత్రిలో దంత చికిత్స చేయించుకున్న అనంతరం తిరిగి ఇంటికి బయలుదేరారు. మంచిలి డంపింగ్ యార్డు వద్దకు వచ్చేసరికి భీమవరం నుంచి తణుకు వెళుతున్న ఆర్టీసీ బస్సుకు మోపెడ్ హ్యాండిల్ తగలడంతో అదుపు తప్పి కింద పడిపోయారు. వరలక్ష్మి పైనుంచి బస్సు వెనుక చక్రాలు వెళ్లిపోవడంతో ఆమె ఘటనా స్థలంలోనే మృతి చెందింది. భర్త సత్యనారాయణ మోకాళ్లకు గాయాలుకావడంతో తణుకు ఆసుపత్రికి తరలించారు. ఏఎస్సై ఎస్.వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడపగడపకు సంక్షేమం



ఉండి : ఉండి గ్రామంలోని మూడో సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్‌లను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఎస్సీ, ఎస్టీ వీఏఎం కమిటీ సభ్యుల నియామకం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పశ్చిమగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులుగా ముగ్గురు నియమితులయ్యారు. వీరిలో తాడేపల్లిగూడెంకు చెందిన మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు, తెన్నేటి జగ్జీవన్, గొరగనమూడికి చెందిన పొన్నమండ బాలకృష్ణ ఉన్నారు. భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శోభారాణి నుంచి వీరు నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ఏ సమస్య వచ్చినా తనకు తెలియజేస్తే అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ యూ.రవి ప్రకాష్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.





నియామక పత్రం అందుకుంటున్న తెన్నేటి జగ్జీవన్, పొన్నమండ బాలకృష్ణ, చీకటిమిల్లి మంగరాజు

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులుగా తాడేపల్లిగూడెంకు చెందిన తెన్నేటి జగ్జీవన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. పలువురు జగజ్జీవన్‌కు అభినందనలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చూస్తా

పాలకోడేరు: ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులుగా గొరగనమూడి గ్రామానికి చెందిన పొన్నమండ బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి చేతుల మీదుగా బుధవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లా లోని ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'మొక్కజొన్న'లో మెలకువలు ఇలా..

- ఖరీఫ్ పంట ప్రారంభానికి ఇదే అదును
- పూత, గింజ దశల్లో నీటి తడులు తప్పనిసరి
- ఏలూరు, పశ్చిమలో 48వేల హెక్టార్లలో సాగు



మెట్ట ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న ఖరీఫ్ మొక్కజొన్న



చింతలపూడి: ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగులో కొద్దిపాటి మెలకువల పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మొక్కజొన్న పంటను వర్షాధారంగా, సాగునీటి కింద పండించవచ్చు. దీనిని ఆహార పంటగానే కాకుండా దాణా రూపంలో పశువులకు మేతగా, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగా, పేలాల పంటగా, కూర గాయల రకంగానూ పండిస్తున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 48 వేల హెక్టార్లలో రైతులు మొక్కజొన్న సాగు చేస్తూ ఏటా 4.40 లక్షల టన్నుల దిగుబడి సాధిస్తున్నారు. ఖరీఫ్ మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగు వివరాలను వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగకుమార్ రైతులకు సూచించారు.

విత్తే సమయం

సాధారణంగా జూన్ 15 నుంచి జూలైలోగా విత్తుకోవాలి. అయితే వర్షాలు ఆలస్యంగా కురిస్తే నీటి వసతి కింద స్వల్పకాలిక హైబ్రీడ్ రకాలను ఆగస్టు రెండో వారంలో కూడా విత్తుకోవచ్చు.

అనువైన రకాలు

దీర్ఘకాలిక రకాలు (100–120 రోజుల పంటకాలం) డీహెచ్ఎం-113, 900 ఎం గోల్డ్, బయో 9861, ప్రో-311, 30బి07

మధ్య కాలిక రకాలు : (90–100 రోజుల పంటకాలం) డీహెచ్ఎం-111, 117, 119, కేహెచ్-510, బయో-9657, కేఎం-9541, ఎంసీహెచ్-2



బి.నాగకుమార్, ఏడీఏ

స్వల్పకాలిక రకాలు

(90 రోజుల కంటే తక్కువ పంటకాలం) డీహెచ్ఎం-115, ప్రకాశ్ కేహెచ్-5991, జేకేఎంహెచ్-1701, డీకేసీ-7074 ఆర్, ఎంఎంహెచ్-1701, డీకేసీ-7074 ఆర్, ఎంఎంహెచ్- 133, 3342.

ప్రత్యేక రకాలు

తీపి మొక్కజొన్న (స్వీట్ కార్న్) మాధురి, ప్రియ, విన్ ఆరెంజ్, అల్మోరా స్వీట్ కార్న్ రకాలు, సుగర్-75, బ్రైట్‌జీన్ సంకర రకాలు

విత్తే విధానం

ఎకరాకు సంకర రకాలైతే 7–8 కిలోల విత్తనం వాడి 60 సెం.మీ దూరంలో బోదెలు చేసి సాళ్లలో 20 సెంమీ ఎడంగా విత్తాలి. ఇలా విత్తితే ఎకరాకు సుమారు 33,333 మొక్కలు వస్తాయి. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్ లేదా డైథేన్ ఎం-45 చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసి బోదెకు ఒక పక్కగా విత్తాలి.

ఎరువుల వాడకం

ఖరీఫ్ పంటలో ఎకరాకు 72–80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వాడాలి. మొత్తం పొటాష్, భాస్వరం ఎరువులను పంట విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఒకవేళ జింక్ లోపం ఉంటే ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్ లోపం గమనిస్తే జింక్ సల్ఫేట్ (20 గ్రా) పిచికారీ చేయాలి.

కలుపు నివారణ

పంట విత్తాక 45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. మొక్కజొన్న పంటను ఏక పంటగా వేసినప్పుడు నేల రకాన్ని బట్టి ఎకరాకు 800–1200 గ్రా. అట్రాజిన్ పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట విత్తిన వెంటనే లేదా 2–3 రోజుల్లోగా పిచికారీ చేసి కలుపును నివారించవచ్చును. వెడల్పాటి కలుపు మొక్కల నివారణకు విత్తిన 30 రోజుల తర్వాత ఎకరాకు అరకిలో 2, 4-డి సోడియం సాల్ట్‌తో పిచికారీ చేయాలి.

నీటి తడులు

వర్షాధారంగా సాగు చేసినా పూత దశలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే వీలున్న చోట నీటి తడి ఇస్తే మంచి దిగుబడులు వస్తాయి. పూత దశ, గింజలు ఏర్పడే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. పైరు తొలి దశలో పొలంలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

సస్యరక్షణ

పైరు తొలిదశలో ఆశించే మొవ్వ తొలిచే పురుగు నివారణకు ముందు జాగ్రత్తగా విత్తిన 10–12 రోజులకు పైరుపై మోనోక్రోటోఫాస్ (1.6 మి.లీ) లేదా కోరా ఎస్ (03 మి.లీ) మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు 25–30 రోజుల దశలో ఆకు సుడుల్లో వేయాలి.

ఆకు మాడు తెగులు నివారణకు మాంకోజెబ్ (2.5 గ్రా) మందును లీటరు నీటిలో కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పొడ తెగులు లక్షణాలు కనిపిస్తే మొక్క దిగువనున్న 2–3 ఆకులు తుంచివేసి ప్రొపికొనజోల్ (1 మి.లీ) మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొక్క ఎండు, కాండం మసి కుళ్లు తెగుళ్లు రాకుండా ముందు జాగ్రత్తగా ఎదుర్కొనే రకాల సాగు, పంట మార్పిడి, వేసవిలో లోతు దుక్కులు, పూత దశ తర్వాత నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు చూసుకోవాలి.

సమష్టిగా పనిచేస్తేనే సమస్యల పరిష్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తేనే ప్రజలు సమస్యలు శతశాతం పూర్తవుతాయని టూటౌన్ సచివాలయాల కన్వీనర్ కర్రి భాస్కరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగులు అన్నారు. స్థానిక 16వ వార్డు సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన అత్యంత ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా పట్టణంలోని 1వ వార్డు నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. వార్డులోని గృహాలను సందర్శించి ప్రజల నుంచి వివరాలు సేకరించి, వారం రోజులు అనంతరం సచివాలయం వద్ద శిబిరం నిర్వహించి ఆయా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇంటింటి సర్వేలు నిర్వహించి ఏమైనా లోటుపాట్లు ఉంటే సవరించి, అర్హులు ఉంటే వారికి సంక్షేమ పథకాలు అమలు అయ్యేవిధంగా చూస్తామని చెప్పారు. అవసరమైన ధ్రువపత్రాలు కూడా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండుమోగుల బలుసులరావు, మండల లెవెల్ ఆఫీసర్ మారిశెట్టి రమణ, వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పట్టణంలోని 17వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కర్రి భాస్కరరావు తదితరులు


తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


మండపాక గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో నాయకులు, వలంటీర్లు

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో స్థానిక 17, 14 వార్డుల్లో బుధవారం జగనన్న సురక్ష పై అవగాహన సమావేశాన్ని కర్రి భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి భాస్కరరావు మాట్లాడుతూ గృహాలను సందర్శించి అవసరమైన వారికి ధ్రువపత్రాలకు పేర్లు నమోదు చేసుకొని వారి వద్ద నుంచి సంబంధిత పత్రాలను సేకరించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల వివరాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి రమణ, బొడ్డు సాయిబాబా, ఆయా వార్డుల గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ సమన్యాయం సీఎం జగన్ లక్ష్యం

తాడేపల్లిగూడెం రూరల్: అందరికీ సమన్యాయం చేయడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి, వారికి లబ్ధి చేకూర్చేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సురక్ష కార్యక్రమంలో 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నవాబుపాలెం పంచాయతీ కార్యదర్శి రమేష్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

తణుకు టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు కోరారు. బుధవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని 2వ సచివాలయం పరిధిలోని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులకు జగనన్న సురక్ష కార్యక్రమంపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో సూచించిన సర్వే, సేవల గురించి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యతయుతంగా మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కరిబండి రాజేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల మణికంఠ, గ్రామ కార్యదర్శి యుగంధర్ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం కొమరవరం, కోనాల, కోనాల, వేల్పూరు 1వ గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు అవసరమైన సేవలను గుర్తించి నమోదు చేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు.

క్లుప్తంగా

విద్యుత్‌శాఖలో భద్రతపై అవగాహన


తణుకులో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

తణుకు: క్షేత్రస్థాయిలో పని చేసే విద్యుత్ శాఖలోని సిబ్బంది భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారానే విద్యుత్ ప్రమాదాలు నివారించవచ్చని తణుకు సబ్‌డివిజన్ ఏడీఈ సీహెచ్ రామకృష్ణ అన్నారు. జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం తణుకు సబ్ డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహించిన అవగాహన సదస్సులో కళా జాత బృందాలు బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ విధి నిర్వహణలో సిబ్బంది బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు సాధిక్, జాన్సన్, రవిప్రసాద్, జూనియర్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత


వాకర్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత అని ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కురుమళ్ళ వెంకటాచలం తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. వెంకటాచలం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. వృక్షాలను నరకవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ వనచర్ల ప్రసాద్, కె.నరసింహమూర్తి, పి.కుమారస్వామి, పరమాత్మ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ దేవస్థానానికి వెండి వితరణ


ముత్యాలంబాపురం ముత్యాలమ్మ వారి దేవస్థానానికి వెండి విరాళం అందజేస్తున్న దాతలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మ వారికి పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన ద్వారబంధం వెంకటసురేష్ – నాగవెంకట కోట సత్యశ్రీ దంపతులు బుధవారం 250.300 గ్రాముల వెండిని బహూకరించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు వేదాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.హరేరామ్‌ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ సేవలు విస్తృతం


రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవలతో సంఘ, సేవలు విస్తృతం చేస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని గీతా మందిరంలో బుధవారం రాత్రి సంఘ 133వ నెలవారీ సభను నిర్వహించారు. తొలుత కళాకారులచే జ్యోతి ప్రజ్వలన గావించారు. రైల్వేస్టేషన్ చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ బహురోతు భాస్కరరావుకు గౌరవ సత్కారం అందజేశారు. సీనియర్ బుర్ర కథ కళాకారులు నక్కా కృష్ణమూర్తికి కళా సత్కారం, అధ్యాపకులు దంతులూరి శ్రీరామకృష్ణంరాజుకు ఉత్తమ ఉద్యోగ పురస్కారం, పేద కళాకారునికి ఆర్థిక సత్కారం గావించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి మురళీకృష్ణ, సూరంపూడి వెంకట రమణ, పైలు శ్రీనివాస్, రైల్వే యూనియన్ సీనియర్ నాయకులు వీవీవీ నాగేశ్వరరావు, దానయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులతో ట్రాక్ సంగీత విభావరి జరిగింది.

నేడు శ్రీవరాల వెంకన్నకు అభిషేక పూజలు


అత్తిలి మండలం ఈడూరులో వరాల వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

అత్తిలి: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామివారికి గురువారం అభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు తెలిపారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు 200 లీటర్ల ఆవుపాలతో క్షీరాభిషేకం, 7 లీటర్ల పెరుగు, 7 కిలోల నెయ్యి, 7 కిలోల తేనె, 7కిలోల పంచదార, 7కిలోల పసుపు, 7 కిలోల కుంకుమ, 7కిలోల అష్టగంధం, 7కిలోల వట్టివేళ్లు, 7 రకాల పళ్లరసాలు, 7రకాల చూర్ణాలు, వివిధ సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్వామివారికి విశేష అభిషేకాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. భక్తులు హాజరై స్వామివారికి జరిగే మహాభిషేక కార్యక్రమాన్ని తిలకించి, స్వామివారి పరిపూర్ణమైన దివ్య ఆశీస్సులు పొందాలని కోరారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఇరగవరం: పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని మండల సీపీఐ నాయకులు నామాన వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఇరగవరం సబ్ స్టేషన్ వద్ద పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రూ ఆఫ్ చార్జీలు, తగ్గించాలని మోటార్లు స్మార్ట్ మీటర్లు అమర్చవద్దు అని పేర్కొన్నారు. ట్రూ ఆఫ్ చార్జీలు పేరుతో గతంలో వాడిన విద్యుత్‌కి ఇప్పుడు డబ్బులు వసూలు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రజలకు ఇబ్బంది లేకుండా చార్జీలు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దా సూర్యనారాయణ, కుడిపూడి వెంకట రెడ్డి, కోనా సాయిబాబు, చిక్కాల బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాడు తడబడి...నేడు నిలబడి

- విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు
- కోట్ల నిధులతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పన

పెంటపాడు: ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. మనబడి, నాడు– నేడు పథకంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దారు. బోధన విధానంతో పాటు, మౌలికవసతుల కల్పనలో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకొన్నారు. ఫలితంగా చెట్టుకింద కూర్చుని చదవడం, ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవడం, పంట కాలువ, మురుగు బోదెల వద్ద భోజనం పేట్లు శుభ్రపరచుకోవడం వంటి దయనీయ పరిస్థితులకు చరమగీతం పాడారు. తల్లిదండ్రులకు పైసా ఖర్చులేకుండా కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్నామనే భావనను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కల్పించారు. ప్రస్తుతం పల్లెలలో ప్రభుత్వ బడులు కార్పొరేట్‌కు దీటుగా సకల సౌకర్యాలతో కళకళలాడుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా భవనాలు, సౌకర్యాలు:

మండలంలో 9 జిల్లాపరిషత్ పాఠశాలు, 55 ఎంపీపీ పాఠశాలలు మరో మూడు యుపీ పాఠశాలలు ఉన్నాయి. ప్రస్తుతం 5090 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. నాడు– నేడు పథకంలో భాగంగా మొదటివిడతగా 24 పాఠశాలలు గాను తొలివిడతలో రూ.5.20 కోట్లతో పాఠశాలలు తీర్చిదిద్దగా రెండో విడతలో 45 పాఠశాలలకు గాను రూ. 17 కోట్లతో పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారు. పలు గ్రామాల్లో వేగంగా రెండో విడత పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం పలు గ్రామాల్లోని పాఠశాలల్లో పనులు వేగంగా సాగుతున్నాయి. తరగతి గదులు గోడలపై ఆశక్తి కలిగించే బొమ్మలతో పాటు, విశాల క్రీడా ప్రాంగణాలు, ప్రహరీలు ఏర్పాటు చేసి పాఠశాలలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో హస్టల్ విద్యార్థులు ఆరు బయట చెట్టుకింద కూర్చుని చదువుకొనే వారు. కనీసం మంచినీరు లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి నీళ్లు తాగడం పంటకాలువలో శుభ్రం చేయడం చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వ చొరవతో గత పరిస్థితులన్నీ కనుమరుగై పోయాయి. తరగతి గదులలో దర్జాగా ఫ్యాన్‌ల కింద కూర్చుని ఆహ్లాదకర వాతావరణంలో పాఠాలు నేర్చుకొంటున్నారు.


నాడు- నేడు పథకంలో కోరిమిల్లిలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాల

చరిత్రలో గుర్తుండిపోయేలా మార్పులు



చరిత్రలో గుర్తుండిపోయేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో మార్పులు తెచ్చారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండేవి. ఇప్పుడు బడులు సకల సౌకర్యాలతో కళకళలాడుతున్నాయి. పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నం భోజనం, ఇలా అన్ని విషయాల్లో మార్పులు చేయడంతో ప్రభుత్వ పాఠశాలలకు ఆధరణ పెరిగింది. విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు నాంది పలికింది. సీఎం జగన్ విద్యావ్యవస్థపై చూపుతున్న శ్రద్ధ అభినందనీయం

– ఎం. శ్రీనివాస్, ఎంఈవో పెంటపాడు మండలం

నేడు ద్వారకా తిరుమలకు ప్రత్యేక బస్సులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా తాడేపల్లిగూడెం బస్సు స్టేషన్ నుంచి ద్వారకా తిరుముల వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి ఈ నెల 29వ తేదీ గురువారం తెల్లవారుజాము నుంచి ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. ప్రయాణీకులు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

లయన్స్ క్లబ్ ఉండి కార్యవర్గం ఎంపిక

ఉండి: లయన్స్ క్లబ్ ఉండి నూతన కార్యవర్గాన్ని నియమించినట్టు ప్రస్తుత క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గొట్టుముక్కల రాము, కలిదిండి సీతారామరాజు బుధవారం తెలిపారు. ఉండిలో నిర్వహించిన సమావేశంలో క్లబ్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షురాలిగా వేగేశ్న అనంతలక్ష్మి(మహదేవపట్నం), కార్యదర్శిగా కన్నెగంటి రూత్‌కళ (ఎన్నార్పీ అగ్రహారం), కోశాధికారిగా సాగిరాజు సూర్యకుమారి (ఉండి), ఉపాధ్యక్షులుగా సత్తి బ్రహ్మారెడ్డి, గాదిరాజు రంగరాజు, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్‌గా సాగిరాజు సాంబశివరాజు, సర్వీస్ చైర్మన్‌గా ద్వారంపూడి నారాయణరెడ్డి, మెంబర్‌షిప్ చైర్మన్‌గా కూనపరాజు రామరాజు, అడ్మినిస్ట్రేటివ్ చైర్మన్‌గా రుద్రరాజు నరసరాజు, మార్కెటింగ్ చైర్మన్‌గా ముదునూరి శివరామరాజు ఎంపికైనట్టు చెప్పారు. నూతన కార్యవర్గం జూలై 1 నుంచి బాధ్యతలు చేపడతారని తెలిపారు.

ఆర్‌బీకే సేవలను వినియోగించుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు ఆర్‌బీకే సేవలను వినియోగించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో వో ఆర్ఎస్.ప్రసాద్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఏడీఏ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులను పొందాలని సూచించారు. విత్తనాలు నుంచి ధాన్యం విక్రయించే వరకు సీసీఆర్‌సీ కార్డులు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయం, హెల్త్ సెంటర్లను పరిశీలించారు. ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ శారద, రైతులు చింతా మోహనరావు, పాలడుగు కృష్ణ, బండి రామకృష్ణ, శేషగిరిరావు, బుల్లిరాజు, ఆర్‌బీకే ఇన్‌ఛార్జీలు నాగరాజు, వీర్రాజు, శివశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెంలో వరి నారుమడులను పరిశీలిస్తున్న దృశ్యం

విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

తణుకు టౌన్: విద్యార్థినులు తమ చుట్టూ ఉన్న సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకుంటూ ఆర్థిక అక్షరాశ్యత కలిగి ఉండాలని తణుకు జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వీ అరుణ చెప్పారు. బుధవారం తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీ అరుణ మాట్లాడుతూ విద్యార్థినీలు చదువుతో పాటు తమ ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని కోరారు. ఆహరపు నియమాలను పాటిస్తూ ఆరోగ్యవంతంగా ఉంటేనే భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషా రాణి మాట్లాడుతూ విద్యార్థినీలు కేవలం చదువుకే పరిమితం కాకుండా వివిధ వృత్తుల్లో ప్రావీణ్యం సంపాదించాలని కోరారు. తమని తాము రక్షించుకునే విధంగా శిక్షణ అవసరమన్నారు. ఈకార్యక్రమంలో వెంకట కృష్ణా ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, కోశాధికారి నందిగం సుధాకర్, వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి, తదితరులు మాట్లాడారు. ఈకార్యక్రమంలో కళాశాలలో బ్యూటీషియన్ డిప్లొమో కోర్సు పూర్తి చేసిన విద్యార్థినీలకు సర్టిఫికేట్‌లను అందజేశారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.


ఫేర్‌వెల్ కార్యక్రమంలో విద్యార్థినులకు సర్టిఫికేట్‌లు అందజేస్తున్న దృశ్యం

చిన్నారులకు సృజనాత్మకత విద్యను అందించాలి

అత్తిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. అత్తిలి మండలం తిరుపతిపురం సెక్టార్ పరిధిలోగల అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం తిరుపతిపురం గ్రామంలో పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ప్రతి రోజూ నిర్వహించే కార్యక్రమాలు, వాట్సాప్ గ్రూపుల నుంచి వచ్చే కార్యక్రమాలు నిర్వహించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. దీనివల్ల చిన్నారుల్లో మేధాభివృద్ధి, సామాజిక–సాంఘిక, శారీరక, భాషాభివృద్ధి, గణితాభివృద్ధి, సృజనాత్మకత పెంపొందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి రాగసుధ, హబ్ అంగన్‌వాడీ టీచర్ సీహెచ్‌ఆర్‌కే కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


తిరుపతిపురంలో అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

అగ్ని ప్రమాదాల నివారణపై శిక్షణ


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌పై అవగాహన పెంచుకోవాలని పట్టణ అగ్నిమాపక అధికారి గణేశ్న వెంకట రామారావు అన్నారు. ప్రత్తిపాడు ట్రిబుల్ ఎఫ్ ఇండస్ట్రీలో బేసిక్ ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ అవగాహన బుధవారం మూడో రోజు ముగింపు శిక్షణా కార్యక్రమం జరిగింది. వివిధ ప్రమాదాల్లో చిక్కుకున్న వ్యక్తులను సులువుగా ఏ విధంగా రక్షించాలో పాల్గొన్న అభ్యర్థులకు డెమో ద్వారా తెలిపారు. ప్రమాదంలో వ్యక్తులు అపస్మారక స్థితిలోకి వెళ్లినప్పుడు, సీపీఆర్‌లో అవగాహన, వివిధ అగ్నిప్రమాదాలు నివారణ తదితర విషయాలపై డెమోలో అవగాహన కల్పించారు. తరగతులు అనంతరం ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించి బేసిక్ ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రిబుల్ ఎఫ్ ఇండస్ట్రీ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ జె.జనార్ధన్, వివిధ పరిశ్రమలు, ఆసుపత్రులు, కళాశాలలు, పాఠశాలలకు చెందిన సిబ్బంది హాజరయ్యారు. ట్రిబుల్ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రజలు సహకరించాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని పలు వార్డులో డ్రెయినేజీల వ్యవస్థ అస్థవ్యస్తంగా ఉండటంతో వాటి నుంచి సక్రమంగా మురుగునీరు పారుదల జరిగేలా బుధవారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ చర్యలు చేపట్టారు. 31, 32 వార్డుల్లో సమస్య అధికంగా ఉండటంతో కచ్చా డ్రెయిన్లను పూడిక పనులు నిర్వహించారు. మురుగునీరు నిలువ ఉన్న ప్రాంతాలను గుర్తించి మురుగు పారేలా తవ్వించారు. దోమల నివారణకు ప్రజలు సహకరించాలన్నారు. తమ ఇంటిలోని చెత్తాచెదారాలను డ్రెయినేజీల్లో పారవేయవద్దని సూచనలు చేశారు.

అత్యవసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట నీలం నాగబూషనం తదితర సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత ఎర్రియ్య మృతి


గూడెల్లి ఎర్రియ్య (ఫైల్)

తణుకు: తణుకు మున్సిపల్ రిటైర్డ్ పారిశుద్ధ్య కార్మికుడు, తణుకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు గూడెల్లి ఎర్రియ్య (76) బుధవారం తణుకులో గుండెపోటుతో మృతి చెందారు. ఏఐటీయూసీ కార్మిక హక్కుల సాధన కోసం జరిగిన పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ జరిగిన అనేక సమ్మె పోరాటాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు బొద్దాని నాగరాజులు ఎర్రియ్య భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లులర్పించారు.

మలేరియాపై విద్యార్థులకు అవగాహన

తణుకు అర్బన్: పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతపైనా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని రవీంద్రనాథ్ ఠాగూర్ మునిసిపల్ నంబరు 4 పాఠశాలలో బుధవారం మలేరియా వ్యాధిపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణల్లో దోమల వ్యాప్తిని అరికట్టాలంటే ఆవరణ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పోటీల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జి.మానస, ఆర్.లలిత్‌లకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.కర్నేలు, ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లీగల్ ప్రకటన

[illegible]

స్థలం : తాడేపల్లి గూడెం తేది : 28.06.2023

సం/- గొళ్ళ గోవింద శ్రీచరణ్, అడ్వకేట్, ఏలూరు. సెల్: 9247163349, 8074367438

భూములు కౌలు హక్కుకు బహిరంగ వేలం ప్రకటన

దేవదాయ ధర్మాదాయశాఖ పశ్చిమగోదావరిజిల్లా, తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు గ్రామములో వేంచేసియున్న శ్రీ వీరేశ్వర స్వామి వారి దేవస్థానము సంపూర్ణ హక్కు భూములలో దిగువ ఉదహరించిన భూములను 3 సంవత్సరాలకు అనగా 2023–2024 నుండి 2025–2026 సంవత్సరం వరకు కౌలు హక్కును అనుభవించుటకుగాను కార్యనిర్వహణాధికారి వారిచే తాడేపల్లిగూడెం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో ది. 07.07.2023 ఉదయం 10.00గం॥లకు శ్రీ స్వామి వారి ఆలయం వద్ద బహిరంగ వేలంపాట జరుపబడును. కావున ఆసక్తి గల యావన్మంది ఈ బహిరంగ వేలం పాటలో పాల్గొనవలసిందిగా కోరడమైనది.

వ.నెం	భూమి ఉన్న గ్రామం	సర్వే నెం.	విస్తీర్ణం	ధరావత్తు సొమ్ము
1	కొండ్రుప్రోలు	245	4-05 1/2	5000
2	పెదతాడేపల్లి	818	3-10	5000

గ్రామం: కొండ్రుప్రోలు
తేది: 28-06-2023

కార్యనిర్వహణాధికారి
సెల్: 83328 53252